శ్రీ రమణ జ్యోతి
జూన్ 2020
ఈ సంచికలో ...

**Sri Ramana Jyothi**
June 2020
IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 71వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ భగవాన్ సేవలో** | జి. శ్రీహరిరావు | 9 |
| **3.** | **ఆధ్యాత్మిక పురోగతికి సోపానం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 14 |
| **4.** | **శ్రీరమణమహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 22 |
| **5.** | **శ్రీరమణమహర్షి సూక్తులు** | కమలాకర వేంకటరావు | 27 |
| 6. | The Importance of the Adi Guru | Dr.K. Subrahmanian | 30 |
| 7. | The Sadhana of "Intent Listening" | Vimal Balasubrahmanyan | 36 |
| 8. | Kavyakantha's Chatvarimsat | V. Krithivasan | 38 |
| 9. | Sri Ramaswami Iyer | | 42 |

## Events in Sri Ramana Kendram in June & July 2020

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 23rd June - Punarvasu Satsang - 6.00 - 7.00 p.m.
4. 14th June (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.
5. 5th July - Guru Purnima

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# ఇతరుల అక్కఱను గుర్తించాలి

డా॥ కే.యస్. గారి 71వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

వేసవిలో ఎండలు మండిపోతుంటాయి. మనం తట్టుకోలే మనుకుంటాం. అదే మాట ఇతరులతో చర్చించుకుంటాం. వేడిని తగ్గించుకునే ప్రయత్నాలు ఎవరికి తోచినట్లు వాళ్ళు చేసుకుంటాం. వేడిని తట్టుకోలేమంటే, మన శరీరం వేడిని భరించలేకపోతున్నదనే అర్థం. వేదగ్రంథాలేవైనా చదివినప్పుడు మనం శరీరం గురించిన ఎఱుక, స్పృహ లేకుండ వుండాలని అనుకుంటాం. అది చాలా గొప్ప స్థితి అని భావిస్తాం. మంచి పుస్తకాలు చదివినప్పుడు, సుఖ, దుఃఖాలకు అతీతులైన వారిని దర్శించిన తరువాత, అలా జరుగుతుంది. కాని నిజజీవితంలో అది ఎంత కష్టమైనదో తెలిసి వస్తుంది. వేసవిలో విద్యుచ్ఛక్తి ఆగిపోయినప్పుడు, మళ్ళీ సరఫరా అయ్యే దాక, ఏమీ తోచదు, ఏ పని చేయలేమనిపిస్తుంది.

భగవాన్ రమణులు అరుణగిరిపైని విరూపాక్ష గుహలో ఒకటి, రెండు రోజులు కాదు, 16 సం॥ల పాటు నివాసమున్నారు. ఇప్పుడు మనం ఆ గుహలోకి వెళ్ళితే ఒక రెండు, మూడు నిమిషాల కంటే ఎక్కువసేపు అక్కడ వుండలేము. భగవాన్ అక్కడే వుండి, అక్కడే నిద్రించేవారు. మనం అలా వుండాలంటే, మొత్తం ఏయిర్ కండిషన్ చేయబడి వుండాలి లేదా మనకూ శరీరం స్పృహ లేకుండ వుండాలి. మహర్షి, వేడి, చలికి అతీతులు, వారికి శరీరంపై ధ్యాస అసలు లేకుండెడిది. రమణాశ్రమం ప్రవేశించిన తరువాత ఎదురుగా ఒక

సోఫాలో కూర్చునేవారు. పాత హాల్‌లో ఇప్పటికీ ఒక ఫాన్ వుంది. గమనిస్తే అది భగవాన్ కూర్చునే స్థలం పైన కాకుండ కొంచెం దూరంగా వుంటుంది. అది వచ్చిన భక్తుల కోసం అక్కడ బిగింప బడింది. భక్తులు భగవాన్ ఎదుట కూర్చునేవారు.

## అభిప్రాయాలను గౌరవించాలి

మనం కనికరం గురించి మాట్లాడాలనుకుంటే, మహర్షిని దృష్టిలో వుంచుకోవాలి. ఉదాహరణకు, ఎప్పుడైనా నాకు కాఫీ త్రాగడం ఇష్టం లేదని అనుకుందాం. ఇంట్లో భార్య, పిల్లలతో నేను కాఫీ త్రాగడం లేదు, మీరు కూడ కాఫీ తీసుకోవద్దని చెబితే ఎలా వుంటుంది? ఇతరులను నా ప్రకారం నడుచుకోమన్నాను నేనేదో గొప్పపని చేశాననుకోవచ్చు, కాని అవతలి వ్యక్తికి కాఫీ అలవాటు బాగా వున్నప్పుడు అది త్రాగకపోతే, ఏ పని చేయలేక పోవచ్చునన్న చింత అక్కఱ వుండాలి. అది లేనప్పుడు నేను చేయనిది ఇంకెవ్వరూ చేయకూడదన్న ధోరణి ఏర్పడుతుంది. ఇతరుల మీద కనికరం అన్నది ఇక్కడ బయటపడుతుంది. మంచిదని మనం చెప్పిన దాని ప్రకారం అందరూ నడుచుకోవాలన్న పట్టుదలకు చోటుండరాదు. భగవాన్ పంకా గురించి అవలంబించినది గుర్తుంచుకోవలసిన విషయం.

భగవాన్ తల్లి వంటివారు. వేదాంతులమనుకునే కొందరు తమ లాగే శరీరం గురించిన స్పృహ తమ దగ్గరకు వచ్చే వాళ్ళందరికీ కూడ వుండకూడదనే అభిప్రాయాన్ని కలిగివుంటారు. కాని తాము ఇతరుల కంటే వేరు అన్న అభిప్రాయం ఇతరుల్లో కలుగకూడదనే

ఉద్దేశంతో భగవాన్ అప్పుడప్పుడు తాము చేతి పంకాతో విసురుకునేవారు. ఈ సంగతి నాకు మొదట బోధపడక శరీరం గురించి పట్టించుకొనని వారు ఎందుకు పంకాతో విసురుకొంటారన్న అనుమానం వచ్చేది. నేను అప్పుడు ఇంకా చిన్నవాడిని. ఆయన శరీరానికి చెమట పట్టక పోయినప్పటికీ అప్పుడప్పుడు ఒక తువాలుతో శరీరాన్ని అక్కడక్కడ ఒత్తుకొనడం గమనించేవాడిని. తమకు అవసరం లేనప్పటికీ, ఇతరుల అవసరాలను మరవక పోవడమన్నది మనం మహర్షి నుండి తెలుసుకొనవలసిన ఒక మంచి విషయం.

## మార్పుకు భగవంతుని కృప

ఈ ప్రపంచంలో కొందరు ఏమీ ఆశించని వాళ్ళు కూడ వుంటారు. ప్రజలు పలు విధాలుగా వుంటారని అంగీకరించే నమ్రత వ్యక్తి కలిగి వుండాలి. వాళ్ళకు తోచిన విధంగా బ్రతకనిచ్చే ధోరణి ఏర్పరచుకోవాలి. ఎవరూ చెప్పకపోయినప్పటికీ తమను తాము మార్చుకోవచ్చు. కుటుంబంలోని పిల్లల విషయంలో ఇది చాలా సందర్భాలలో జరుగుతూ వుంటుంది. వాళ్ళంతట వాళ్ళే మనం అనుకునే విధంగా మారుతారు. అలాంటి మార్పులు జరిగినప్పుడు అది మన కారణంగా ఏర్పడినదనుకోవడం కంటే, మన ద్వారా ఆ భగవంతుడు అలా చేయించాడని గ్రహించడం మంచిది. ఆ మార్పు జరిగింది మన వల్ల కాదు. కారణం మనంతట మనం వాళ్ళలో మార్పును తీసుకురాలేము. అది కేవలం బుద్ధిబలంతో కాదు, భగవంతుడి దయ చేత జరిగింది.

హరీంద్రనాథ్ చట్టోపాధ్యాయ తాను అనుకొనని సమయంలో అతనిలో మార్పు జరిగింది. పొగాకు వాడకం హానికరమని ఎందరో వారించినా, అతను ఆ అలవాటును మానుకోలేక పోయాడు. ఇతరుల లాగే ఆయన సోదరి సరోజినీ నాయుడు సలహా ఇచ్చినప్పటికీ, అది పని చేయలేదు. అందుకే ఆమెను కలవడానికి రాజభవన్‌కు హరీంద్రనాథ్ వెళ్ళిన ప్రతిసారి ఆమె అతని కోసం మేలు రకం పొగాకును వుంచి పెట్టేది. ఎంత చెప్పినా మారనప్పుడు కనీసం మంచి రకం సరుకును వాడనిమ్మని ఆమె అభిప్రాయ పడింది.

భగవాన్ రమణమహర్షి గురించి తెలుసుకున్న హరీంద్రనాథ్ రమణాశ్రమానికి వెళ్ళాడు. భగవాన్ యొక్క అమిత సాధారణ జీవన విధానము, కఠోర నైతిక నియమపాలనలచే ప్రభావితుడయ్యాడు. కొన్ని రోజుల పాటు అక్కడ వుండడంతోనే, అతనికి పొగాకు మీద అయిష్టత ఏర్పడింది. హైదరాబాదులో ఒక సమావేశంలో మాట్లాడుతూ, తాను పొగాకును వదలాలనుకోలేదని, పొగాకే తనను వదిలిందని, అన్నారు. ‘‘నేను రమణులను నాతో ఈ అలవాటును మనిపించమని ఎప్పుడూ కోరలేదు. భగవాన్ ఆ అలవాటు నాకు వుందన్న విషయాన్ని అసలు పట్టించుకోలేదు. సాధారణ గురువులైతే తమ దగ్గరికి వచ్చినవారు, ఫలానిది చేస్తే నిన్ను (శిష్యునిగా) అంగీకరిస్తాను అని నిర్దేశిస్తారు. కాని భగవాన్ నన్ను ఒక బిడ్డ లాగ నా బలహీనతలతో సహా ఆదరిచారు. ఆ అలవాటు దానంతట అదే పోయింది. అంతేకాదు గురువు ప్రభావంతో కరుణతో ఎన్నో

జరుగుతాయి. కొన్ని మనకు తెలుస్తాయి. ఎన్నో మనకు పరిమితమైన మనసువల్ల తెలియవు.

భగవాన్ యొక్క గొప్పతనం ఏమిటంటే వ్యక్తులను స్వయంగా తామే అన్నీ జరుపుకొంటున్నామన్న భావనకు స్వాతంత్ర్యాన్ని ఇస్తారు. ప్రాథమిక దశల్లో గురువు మీద ఆధారపడి వుంటామన్నది వారికి తెలియకుండ చూసుకుంటారు. ఒక దశకు చేరిన తరువాత మనంతట మనం ఏమీ చేయలేమని మనకే తెలుస్తుంది. అన్నీ ఆయన కరుణ వల్లనే కలుగుతున్నాయని తెలిసి ఆయనకు శరణు పొందితే అన్ని భారాలు ఆయనే చూసుకుంటాడు. 'కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలం - కర్మల ఫలితాలను ఆయన ఇస్తాడు. ఆయన చేతిలో మనం ఒక పని ముట్టు మాత్రమే. అది గ్రహించిన క్షణం నుండి విజయాల వల్ల సంతోషం గాని, అపజయం వల్ల నిరాశ ఒత్తిడి గాని కలుగబోవు. అన్నిటిని సమభావంతో అంగీకరించే మానసిక శక్తి లభిస్తుంది.

## కనికరం దైవగుణం

మహర్షి మనకందరికి ఒక ఆదర్శప్రాయమైన జీవనాన్ని సాగించి చూపించారు. దానిని గ్రహించి, ఆచరించడమే గాకుండ ఇతరులపై కనికరం చూపడం ముఖ్యం. మన ఉద్దేశాలను, అభిప్రాయాలను ఇతరులపై రుద్దడం వాంఛనీయం కాదు. శీతోష్ణాలకు, సుఖ దుఃఖాలకు రమణులు అతీతులు. ఒక తల్లి లాగ, అలాంటి వాటితో సతమతమయ్యే వారి పట్ల ఎంతో కనికరం చూపేవారు. అదే నిజమైన జ్ఞానం. యథార్థ జ్ఞానమంటే ఇతరులపై కనికరం

చూపడం. నిజంగా, మతం అంటే కరుణ. తనకు ఆసక్తి, అవసరం లేని విషయాలలో కూడ ఇతరుల అభిరుచులను గమనించి నవరసాలతో ఆహారాన్ని వండిపెట్టిన దయాశాలి ఆయన. ఒకరోజు, రెండు రోజులు కాదు, వరుసగా ఏండ్ల కొద్ది, తెల్లవారు జామున 2 గం॥లకే మహర్షి వంటగదిలోకి వెళ్ళి, ప్రొద్దున, మధ్యాహ్నాలకు ఆశ్రమవాసులకు భోజనాన్ని తయారు చేసేవారు.

సాధారణంగా ఆశ్రమాలలో భక్తులు గురువు కోసం భోజనం తయారు చేస్తారు. కాని ఇక్కడ ఈ అసాధారణమైన గురువు తామే భక్తులకు ఆహారం సిద్ధం చేసేవారు. స్కందాశ్రమంలో భగవాన్ గారి తల్లి వంట కోసం వెలిగించిన అగ్ని నిరాటంకంగా నేటికీ ప్రజ్వరిల్లుతోందని, ఎవరో అన్నమాట అక్షరాలా నిజం. రమణాశ్రమంలో భోజనం సాధారణమైన భోజనం కాని ఎంతో రుచిగా వుంటుంది. కారణం అది ఏదో నిపుణులైన వంటవారిచే వండబడడం వల్ల కాదు, భగవానే ఆ వంటవారి ద్వారా అలాంటి ఆహారాన్ని వండింప జేస్తున్నారు. అందుకే ఏళ్ళ తరబడి అది అలాగే నడుస్తోంది.

మనకు తెలియకుండ మనలో మార్పులు మహర్షి తీసుకు వస్తున్నారు. ఆయనను సదా స్మరిస్తూ వుండడమే మనం చేయవలసిన ఏకైక విధి. అలాంటి మానసిక స్థితిని ఇస్తున్నందుకు మనం ఆయనకు కృతజ్ఞులమై వుండాలి. ఆయన కృపతో జరిగే ప్రతి విషయమూ ఆయన ఇచ్ఛగా భావించాలి.

# శ్రీ భగవాన్ సేవలో

- జి. శ్రీహరిరావు

## 20. ఎవరు ఎక్కువ?

1939లో అనుకుంటాను. ఒక వేపచెట్టు క్రింద, అసాధారణంగా శ్రీ భగవాన్ అర్ధనిమీలిత నేత్రాలతో కూర్చొని వున్నారు. చుట్టూ నలుగురైదుగురు మాత్రం భక్తులు కూర్చొని వున్నారు. నేను కొద్ది దూరంలో నుంచొని వున్నాను. ఒక భక్తుడు ఇలా అడిగాడు. "భగవాన్! ఎవరు పైనున్నారు. ఎవరు కింద వున్నారు?" శ్రీభగవాన్ రెప్పలు విప్పి చెట్టువైపు చూస్తూ, చెయ్యి పైకెత్తి "అతను పైన వున్నాడు. మనం కింద వున్నాము" అన్నారు. ఆ భక్తుడు మళ్ళీ ఇలా అన్నాడు, "శ్రీభగవాన్ కేవలం సర్వ సమర్థుడైన భగవంతుడు మనమీద వున్నాడనీ, మనమందరం క్రింద వున్నామనే సత్యాన్ని వక్కాణిస్తున్నట్లు న్నారు. నా అల్ప సందేహమేమిటంటే, మానవుల్లో ఎవరు పైనున్నారు? ఎవరు కింద వున్నారని?" అపుడు భగవాన్, "నేనిదివరకే చెప్పాను. చూడండి. చెట్టుపై కూర్చున్నవారు గొప్పవారు. క్రింద కూర్చున్న నేను, మీరు, అందరం క్రిందివాళ్ళం" అని నవ్వుతూ చెట్టుపైన వున్న కోతిని చూపించారు. ఆ కోతి కిచకిచమంటూ ఎగిరి ఇంకొక కొమ్మకు గెంతి పోయింది. గొప్పవారూ, తక్కువవారూ లేరు అనే సత్యాన్ని శ్రీభగవాన్ అందరికీ అర్థమయ్యే శైలిలో ఎవరికి వారు తాము గొప్పవారు అనుకుంటారని విశదపరిచారు.

## 21. మాతృభూతేశ్వరాలయ కుంబాభిషేకం

అమ్మ అలఘమ్మాళ్ సమాధిమీద గుడి కట్టడానికి 1939లోనే సుముహూర్తం నిర్ణయింపబడింది. మొదటి నుంచీ, శ్రీభగవాన్ తరపున

అన్ని పూజలలోనూ, క్రతువులలోనూ నేనూ, నా భార్య నాగూ పాల్గొంటూ వచ్చాం. నా తండ్రిగారు సన్న్యసించుట వలన, వైదిక కర్మకాండలో ఆయన పాల్గొనడం నిషిద్ధం. ఆలయ నిర్మాణం చివరకు 1948లో పూర్తి అయింది. కుంభాభిషేకం మరుసటి సంవత్సరంలో చేయ నిశ్చయింపబడింది. ముహూర్తం ముందురోజు అర్ధరాత్రి గర్భగుడిలో నేను, శ్రీభగవాన్ పక్కనే నిలబడి, వారు శ్రీచక్రాన్ని తాకి దీవెనలు అందజేసిన తర్వాత నేను ప్రతిష్ఠించాను. ఆ తర్వాత, ఆలయంలో శ్రీమాతృభూతేశ్వరాలయ లింగాన్ని కూడా ప్రతిష్ఠించే అదృష్టం నాకు దక్కింది.

## 22. శ్రీరామచంద్ర పరబ్రహ్మ, వారి భక్తులు గాంధీజీ

తమిళనాడు కాంగ్రెస్ నేతలలో ఒకరైన ఓమండూర్ పి.రామస్వామి రెడ్డిగారు నిస్వార్థులైన దేశ సేవకులేగాక, శ్రీభగవాన్‌కు గొప్ప భక్తులు కూడా. స్వాతంత్ర్యం తర్వాత, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినపుడు, మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రెడ్డిగారిని ఎన్నుకోవడం జరిగింది. స్వాతంత్ర్య సమరంలో భాగంగా 1940 అక్టోబరులో శ్రీగాంధీజీ నిర్వహించిన వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొన్న శ్రీరెడ్డిగారు జైలుకు కూడా వెళ్ళారు. సత్యాగ్రహానికి వెళ్ళే ముందు, శ్రీభగవాన్ దీవెనలూ, అనుమతీ పొందేందుకు వారు ఆశ్రమానికి వచ్చారు. జాతీయవాదిగా, శ్రీరెడ్డిగారికి బహుకాలంగా సన్నిహితుడిని కావున, వారితోపాటు శ్రీభగవాన్ వద్దకు నేను కూడా వెళ్ళాను. సత్యాగ్రహంలో చేరడానికై శ్రీభగవాన్ అనుమతికోసం శ్రీరెడ్డిగారు అర్థించారు. "మీరు సత్యాగ్రహం చేయడాన్ని గాంధీజీ అంగీకరిస్తారా?" అని ప్రశ్నించారు శ్రీభగవాన్. గాంధీగారు చెప్పడం వల్లనే వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొంటున్నానని వినయంగా సమాధానమిచ్చారు శ్రీరెడ్డిగారు. శ్రీభగవాన్ చిరునవ్వుతో,

“గాంధీగారు శ్రీరామసేవకులు. వారి ఆజ్ఞ పాటిద్దామని మీ ప్రయత్నం. ఇంకేం కావాలి? అయితే, ఎవరి ప్రయత్నం వల్లనో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని అనుకోకూడదు. గాంధీగారు ఆంగ్లేయులను ద్వేషించరు. వాళ్ళు మనల్ని పరిపాలించడమే ఆయన వ్యతిరేకిస్తున్నారు” అన్నారు. గాంధీగారి ఆజ్ఞ శ్రీరాముని ఆజ్ఞలాంటిదే అని శ్రీభగవాన్ వక్కాణించడం విని, శ్రీభగవాన్‌కు ప్రణమిల్లి, సెలవు తీసుకున్నారు.

(1988 ఏప్రిల్ ‘మౌంటెన్ పాత్’లో కూడా ఈ సంఘటన శ్రీస్వామినాథన్‌గారి ద్వారా విశదీకరింపబడింది)

ప్రొ. స్వామినాథన్‌గారు ఇంకొక సందర్భంలో శ్రీభగవాన్ అన్న మాటలు నేను వినడం సంభవించింది: “చిరంజీవి హనుమాన్ అంటే అర్థమేమిటి? వేరువేరు సమయాల్లో రామాజ్ఞలను పాటించడానికి హనుమ అవతారం ఎత్తుతూ వుంటారు. మన కాలంలో ఆయన మహాత్మా గాంధీగా అవతరించారు.”

## 23. గాంధీజీ భక్తుడు

1942 ఆగష్టు 8వ తారీఖున, “ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ” ఆంగ్లేయ పాలకులకు వ్యతిరేకంగా “క్విట్ ఇండియా” ప్రతిపాదనను ఆమోదించింది. ఆ మరుసటి రోజు గాంధీగారిని, ఇతర కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. దేశమంతా కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకోవడంతో కారాగారాలు నిండిపోయాయి. వీరందరి పేర్లూ వార్తా పత్రికలలో ప్రచురించారు. ఒకరోజున పెద్ద సోఫాలో కూర్చొని వార్తాపత్రిక చదువుతున్న శ్రీభగవాన్ మురుగనార్‌తోటి, విశ్వనాథస్వామిగారితోటి చిరునవ్వుతో ఇలా అన్నారు: “మన వెంకిటూ ఆశ్రమానికి రాకుండా బయట వున్నట్లయితే అతని పేరు కూడా పేపర్లో వుండేది.”

1946 జనవరి 21 నుండి 26 వరకు, దక్షిణ భారత హిందీ ప్రచార సభ రజతోత్సవాలు మద్రాసులో జరుపబడ్డాయి. ఉత్సవ ఆవిష్కరణ సభకు గాంధీగారు విచ్చేసారు. మా పెద్దబ్బాయి సుందరాన్ని తీసుకొని నేను మద్రాసు వెళ్ళాను. కాంగ్రెస్ పార్టీకి గట్టి మద్దతుదారునైన నన్ను ఎర్రరంగు అనుమతి చిహ్నంతో, ముందు వరుసలో కూర్చోబెట్టారు. గాంధీగారి వసతి గృహానికి వెళ్ళి, వారితో సన్నిహితంగా వుండే సదవకాశమూ, వారి గురించి తెలుసుకునే మహద్భాగ్యమూ నాకు కలిగాయి. శ్రీభగవాన్ ఛాయాచిత్రమూ, కొన్ని ఆశ్రమ ప్రచురణలూ వారికి అందజేసినపుడు, శ్రీభగవాన్ ఫోటోను కొద్ది క్షణాలు పరికించి చూసి, ''ఎంత గొప్ప మహానుభావులు!'' అని హిందీలో అని, వాటన్నిటినీ భద్రపరచమని తన అనుచరునికి ఇచ్చారు. గాంధీజీ మద్రాసులో వున్న కొద్ది రోజులూ వారు చర్ఖాతో నూలు వడికేటపుడు దగ్గరగా కూర్చొనే అవకాశమూ, నడకకు వెళ్ళినపుడు కలిసి వెళ్ళగలిగే అవకాశమూ, ప్రార్థనా సమావేశాలలో పాల్గొనే భాగ్యమూ నాకు కలిగాయి. (మనశ్శాంతి కోసం శ్రీరమణాశ్రమానికి వెళ్ళమని గాంధీజీ తన అనుచరులకూ, స్నేహితులకూ సలహా ఇచ్చేవారు. దాని మేరకు బాబూ రాజేంద్రప్రసాద్, శ్రీజమ్నాలాల్ బజాజ్, శ్రీమతి సరోజినీ నాయుడుగార్లు శ్రీభగవాన్ ఆశీస్సులు అందుకునే నిమిత్తం శ్రీరమణాశ్రమం సందర్శించారు.)

(ఈ తాలూకా విశేషాలు శ్రీస్వామినాథన్‌గారి 'మహాత్మా గాంధీ సంపూర్ణ కార్యకలాపాలు', 70వ భాగంలో పొందుపరచబడినవి).

రజతోత్సవ సభలు ముగిసిన తర్వాత నేను ఆశ్రమానికి తిరిగి వచ్చినపుడు, మా తండ్రిగారు, ఆశ్రమ సర్వాధికారి నాపై మహాకోపంతో

గర్జించారు: "ఏదో సాకుతో నీ ఇష్టప్రకారం పారిపోవాలా? కాంగ్రెస్ సభలు - గాంధీగారు - ఉత్సవాలు - ఏదో ఒకటి..." ఈ అరుపులు విన్న శ్రీభగవాన్ నన్ను వెనకేసుకు వచ్చారు. "ఎందుకు అనవసరంగా వెంకిటూ మీద కోపం తెచ్చుకుంటావు. అతను గట్టి కాంగ్రెస్‌వాది. వెళ్ళనీ. నీకెందుకు బాధ?"

## 24. స్వతంత్ర దిన సంబరాలు

1947 ఆగష్టు 15వ తారీఖు. దేశానికి స్వతంత్రం రావటంతో యావద్భారతం పండుగ చేసుకుంటున్నది. తరువణ్ణామలైలో రాజగోపురం ముందు, అధికారులు, పోలీస్, కాంగ్రెస్ నాయకులు, ప్రజా సమూహాల సమక్షంలో జాతీయ పతాకం ఎగరవేసారు. ఆ ఉత్సవానికి నేను కూడా వెళ్ళాను. అధికారులనూ, కాంగ్రెస్ నాయకులనూ ఆశ్రమానికి ఆహ్వానించాను. అంతకుముందు రోజు ఆశ్రమాన్నంతా రంగురంగుల కాగితములతో చేయబడ్డ జాతీయ పతాకాలతో అలంకరించాను. శ్రీ భగవాన్ కూడా ఈ అలంకరణలో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ 'అనవసరపు' పనులు చూసి సర్వాధికారి రుసరుసలాడుతూ చిరాకు పడిపోయారు. దీనికంతా నేనే బాధ్యుడనని మండిపడ్డారు. బలవంతంగా ఆపడానికి ప్రయత్నించారు. కానీ, శ్రీభగవాన్ అడ్డుపడి అలంకరణను సాగనిచ్చారు. అధికారులతోపాటు కాంగ్రెస్ నాయకులు ఆశ్రమానికి రాగానే నేను పాతహాలుకు వెళ్ళి శ్రీభగవాన్‌ను సభా ప్రాంగణానికి తీసుకు వచ్చాను. త్రివర్ణ పతాకాన్ని వారి పవిత్ర హస్తాలతో ఎగురవేయించాను. అంతా హర్షధ్వానాలు మిన్ను ముట్టాయి. ఆ రోజున ఆధ్యాత్మిక నిలయమైన ఆశ్రమం దేశభక్తితో నిండిపోయింది. *(సశేషం)*

# ఆధ్యాత్మిక పురోగతికి సోపానం

('మౌంటెన్‌పాత్', సంపుటి 56, సంచిక-2 (ఏప్రిల్-జూన్, 2019)లో 'ద లాడర్' అన్న శీర్షికతో ప్రచురించబడిన సంపాదకీయం యొక్క స్వేచ్ఛానువాదం)

**- అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి**

నిత్యజీవితంలో నిజంగా స్థిరమైన ఒక క్షణాన్ని కూడ అనుభవించడం చాలా అరుదని చెప్పవచ్చు. జీవితం నిరంతరం కదలికలతో కూడివున్నదనడంతో, మరుక్షణం ఏమి జరుగుతుందో తెలియకుండ, అనుకోని సంఘటనలతో నిండి వుంటుంది. అందరి విషయంలోను సర్వసాధారణంగా చోటు చేసుకునే లక్షణం శాంతి సుఖాలను అనుభవించాలన్న గాఢమైన కోరిక. అది భౌతిక సౌఖ్యం కావచ్చు లేదా ఉద్యోగ భద్రత, సుఖవంతమైన కుటుంబం, లేదా మనసుకు శాంతినిచ్చే వ్యాపకం కావచ్చు. రమణమహర్షి భక్తులుగా మనం వాంఛించేది గురువుతో పవిత్రబంధం, తద్వారా రమణ అరుణాచలుని దివ్యప్రకాశంలో లీనమైపోవడమే. మన మటుకు అదే ఉన్నతమైన లక్ష్యం, గమ్యం కూడ. అది ఎంతో ఖరీదైన ముత్యం లాంటిది. దాన్ని సాధించడానికి మనం ఎంత చెల్లించ గలమనేదే కాకుండ, దాని సాధనకు మార్గమేమిటి అనేది కూడ ఒక ప్రశ్న.

## ఆధ్యాత్మిక సోపానం

ఆధ్యాత్మిక సోపానమన్నది మార్మిక పరిభాషిలో దీర్ఘమైన చరిత్రను కలిగివుందని చెప్పవచ్చు. ఎందుకంటే అది అజ్ఞానంలో నుండి జ్ఞానం వైపుకు, తమస్సు నుండి సత్వగుణానికి, చీకటి నుండి

ప్రకాశం లోనికి సాధకులు జరిపే ప్రయాణాన్ని విశదంగాను, అధికారికంగాను తెలియబరుస్తుంది. ఆధ్యాత్మికపథంలో మనం మన అనుభవాన్ని దైవికపరమైన అవగాహనను పూర్తిగా సాధించడానికి వేర్వేరు స్థాయిల్లో అనుభవాన్ని, ఈ అధిరోహణలో ఎంత ప్రగతిని సాధించామన్నదానికి కొలమానంగా 'నిచ్చెన' ఉపయోగపడి అంచనా వేయగలుగుతుంది.

ఇతర సాంప్రదాయాలలో కూడ 'నిచ్చెన'ను గురించిన ప్రస్తావన ఉన్నాయనడానికి: బ్రిటిష్ మార్మికవేత్త వాల్టర్ హిల్టన్, 14వ శతాబ్దిలో ప్రస్తావించిన 'ద లాడర్ ఆఫ్ పర్ఫెక్షన్; గ్రీస్ సంప్రదాయంలో జాన్ క్లైమాకస్ 6వ శతాబ్దిలో ప్రతిపాదించిన "ద లాడర్ ఆఫ్ డివైన్ అసెంట్" మొదలైనవి ఉదాహరణలుగా ఇవ్వవచ్చు. గొప్ప సూఫీ మార్మికవేత్త జలాల్-ఉద్-దిన్ మహమ్మద్ రుమీ పదేపదే 'నిచ్చెన' భావనను లేవనెత్తే వాడు. తమ 'మత్నవీ'లో ప్రపంచంలో దేవుడు వేరువేరు ప్రజలకు వేరువేరు 'నిచ్చెనలను' నిశ్చయించాడని వ్రాశాడు. అందులో అతను పంచేంద్రియాలను కూడ ఒక సోపానంగా పేర్కొంటాడు. మిగతా ఆధ్యాత్మిక అన్వేషణలలో వలె కాకుండ అవి ఈ ప్రపంచం వరకే పరిమిత మౌతాయి, భావాతీత ప్రపంచానికి వర్తించవు. ఆధ్యాత్మిక గురువును కూడ ఒక నిచ్చెనగా భావించవచ్చని, అలాంటి సాధకులకు ఉన్నత సత్యానికి దారి చూపి వారికి దైవకృప లభించేవరకు తీసుకెళ్ళి, ఇక 'నిచ్చెన' యొక్క అవసరం లేనంతవరకు తోడు వుంటాడు అని అంటాడు.

## మహర్షి ప్రతిపాదన

మనకు సంబంధించినంత వరకు అతి సరళము, సమర్థ వంతమూ అయిన సోపానం భగవాన్ ప్రసాదించిన 'ఉపదేశసారం' అని గుర్తించాలి. ఆయన మనకు రెండు మార్గాలను ప్రతిపాదించాడు. ఆత్మవిచారణ, శరణాగతి. రూమీ ప్రకారం నిచ్చెనలోని అతి ముఖ్యమైన మెట్టు దేవునిపై నమ్మకం వుంచడం, కాని అంత మాత్రం చేత దేవుడే అన్నీ చూసుకుంటాడు అని నిర్లిప్తంగా వుండమని అనరు. మన నమ్మకం ఉభయ ప్రయత్నాలతో కూడినదై వుండాలి. అంటే, దైవేచ్ఛ అంటూ ఒకటి వుందని ఒప్పుకుని దానికి అనుకూలంగా వ్యవహరించడం ముఖ్యం. ఇది చెప్పుకున్నంత సులభమైన విషయం కాదు. ఉదాహరణకు, మన దగ్గరి వారి మరణం లాంటి సంఘటనలు ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు పట్టుసడలే అవకాశం వుంటుంది.

అనుభవాన్ని బట్టి ఒక విషయం చెప్పవచ్చు. 'నిచ్చెన'లో పై మెట్టుకు చేరుతున్న కొద్దీ, అవగాహన పెరుగుతుంది, పక్వత ఏర్పడుతుంది. వాటి ఫలితంగా, మన వ్యక్తిత్వ భావన నశిస్తుంది. నిగూఢంగా పనిచేసే దైవకృప కారణంగా మనం శరణాగతి చెందడానికి పూర్తిగా సిద్ధంగా వుండగలుగుతాము.

ఈ ప్రయాణంలో మన ఓర్పు నశించవచ్చు. లేదా మరో విధంగా చెప్పాలంటే, పయనం ఆగిపోయినప్పుడు తొందరగా బయటపడాలన్న తపనతో నిస్పృహ చెందవచ్చు. కాని ఇది అంచెలంచలుగా పయనించాల్సిన మార్గం అని మనం

గుర్తుంచుకోవాలి. ఎవరో చాలా అరుదుగా శ్రీమహర్షి వంటి వారు (1896 సం॥లో మదురైలో) అతి తొందరగా గమ్యాన్ని చేరగలిగారు. మనబోటి సాధారణ వ్యక్తుల పయనం నిదానంగా వుండబోతుంది.

భగవాన్ జీవితకాలంలో కొన్ని సందర్భాలలో ఆత్మసాక్షాత్కారం కోసం పట్టువిడువకుండ విసిగించిన సందర్భాలున్నాయి. వాళ్ళు అసలు పట్టించుకోకుండ మరీ తీవ్రమైన విజ్ఞాపనను చేసినప్పుడు కోరికను దయతో మన్నించేవారు. అప్పుడు వాళ్ళను దైవిక కృప వైపు కేంద్రీకరింప జేసేవారు. కాని అలాంటప్పుడు సాధకుడు పరిపక్వత చెందని స్థితిలో వుంటే ఆ ధాటికి తట్టుకోలేకపోతే, అక్కడ నుంచి నిష్క్రమించడం లేదా ఓర్చుకోలేనని వేడుకోవడం జరిగేది. జీవితంలో మిగతా విషయాల లాగ మానసికంగా తయారులేనప్పుడు ఒత్తిడిని భరించడం వీలుకాదు. అది అసలు వంటను నేర్చుకొనని వాడిని ఏదో ప్రత్యేక వంటకం తయారు చేయమన్నప్పుడు ఎదుర్కొనే పరిస్థితి వంటిది.

భగవాన్ యొక్క అనుగ్రహం తీవ్రస్థాయిలో ప్రసరించినప్పుడు అది ప్రకోపించిన మంటలాంటిది. కాని వాత్సల్యపూరితమైన తల్లి లాగ వ్యక్తికి సాధనలో అప్పటి అడ్డంకిని ఎదుర్కొనడానికి అవసరమైనంత మేరకే దయను ప్రసరింపజేస్తారు. ఆయన చెప్పినట్లు సాధకుడు గ్రహించడానికి వీలున్నంత స్థాయిలో మాత్రమే కృప ప్రసాదించ బడుతుంది. మనం నదికి ఒక గ్లాసును పట్టుకువెడితే దాని నిండ నీళ్ళు లభిస్తుంది. ఒక పీపా అయితే అది కూడ నింపబడుతుంది. మనం చేయాల్సింది, నిరంతరం

ప్రవహిస్తుండే భగవాన్ కృపను స్వీకరించడానికి నిండు హృదయాలతో ఎదురు చూడడం మాత్రమే. భగవాన్ దయార్ద్రత దిఙ్మండలమంత విశాలమైనది.

## మౌలిక సూత్రాలు ఒక్కటే

ఆధ్యాత్మిక పథం చక్కగా నిర్దేశించబడివుంది. ప్రతి ఒక్కరమూ మన ప్రగతి మన వరకే విశిష్ఠమైనదని అనుకోవచ్చు. కాని అది నిజం కాదు. ఆ మార్గం యొక్క మౌలిక సూత్రాలు ఒక్కటే. అందుకే సాధువుల కథలు, వారి బోధనలు 10 సంవత్సరాలు కాదు, 500 సంవత్సరాలకు పూర్వం సంబంధించినవైనప్పటికీ, అవి ఈనాటికీ వర్తిస్తాయి. మానవ స్వభావం, ప్రపంచ వ్యాప్తంగా మౌలికంగా ఒకటే అయి వుంటుంది. లేకుంటే, భూమి మీద ఏ ప్రాంతంలో వున్న వారి విషయంలో గాని, చారిత్రికంగా ఏ కాలంలో నివసించి వుండిన వారి విషయంలోగాని, వారి ఆధ్యాత్మిక ప్రగతి, పయనాలతో మనం మమేకం కావడం ఎందుకు జరుగుతుంది? ప్రాచీన కాలం నాటి ఆధ్యాత్మికవీరుల కథలు విన్నప్పుడు, మనమూ ఆ ప్రయణాన్ని కొనసాగించగలమన్న ఆశ ఉదయిస్తుంది.

ఉన్నత ఆశయంపైన, మన ఆలోచనలు, భావనల యొక్క ఊహాతీత లక్షణాలపైన, నమ్మకం లేనప్పుడు జీవితం అర్థరహిత మౌతుంది. ఎందుకంటే అలాంటి సందర్భాలలో ఎటు ముందుకు సాగాలో తెలియరాదు. దైనందిన జీవన పోరాటాలను, వాటితో జతపడిన బాధలను సులభంగా అధిగమిస్తామని అనుకోవడం అర్థం లేని విషయం. అలాంటప్పుడు సోపానమన్నది ఒకటి వుంటుందని

గ్రహిస్తే ఆశలు రేకెత్తుతాయి. మనల్ని కట్టిపడేసే రోజువారీ పరిమితులను అధిగమించే చైతన్యం వుందన్న నమ్మకం బలపడుతుంది.

ఇది బుద్ధుడు ప్రతిపాదించిన ''నాలుగు ఘనమైన సత్యాలు''ను పోలినదనవచ్చు. అవి: ''దుఃఖం'', దుఃఖమూలం సముదాయ; దుఃఖాంతం ''నిరోధ''; దుఃఖ నివారణామార్గం ''మాగ్గ'' ఇందులో నాల్గవది మనం చర్చించుకుంటున్న బాధలకు నివారణామార్గం వుందన్న సత్యం. గురువు యొక్క ఆధ్యాత్మిక సన్నిధిలో వున్నప్పుడు మనల్ని దుఃఖ సముద్రం నుండి బయటకు తెస్తాడన్న నమ్మకం కలిగి, గుండె సమాధాన పడి సంతోషించనివారు ఎవరుంటారు? భగవాన్ సమాధి ముందు నిలిచిన క్షణంలో స్వంత గూటికి చేరామన్న భావన ఎందరు అనుభవించలేదు? లెక్కలేనంత మంది భక్తులు ఈ అపూర్వ అనుభవాన్ని పొందారు.

## వ్యర్థం కాని అన్వేషణ

మనం శ్రీరమణ మహర్షి యొక్క శక్తిని, కృపను గుర్తించడమే గాకుండ, ఆత్మసాక్షాత్కార స్థితిని మనమూ చేరగలమని గ్రహించాలి. మన అన్వేషణ వ్యర్థం కాదు. అసలు పరిష్కారానికి మార్గం మనదగ్గరే వుందని తెలుసుకోవాలి. కావలసిన వనరులు మనలోనే వున్నాయని భగవాన్ పదేపదే చెబుతుంటారు. ఆ కోణం నుంచి విచారిస్తే మనమే నిచ్చెన. అంటే మన అజ్ఞానం, పరిమితులను అధిరోహించే బలమైన శక్తి, మనలోనే ఇమిడి వున్నాయి. పశువులకు, మనిషికి వుండే ముఖ్యమైన తేడాలలో ఇది ఒకటి.

మన ఆశలు, మంచి జీతం లభించే ఉద్యోగం ఇచ్చే భద్రత మొదలుకొని, అటు చివర సమాధి స్థితిని సాధించాలన్న నిశ్చయం దాకా, ఎన్నో వుండవచ్చు. సమాధి అంటే ఒకే విషయం పై ఏకాగ్ర దృష్టితో 'సమమైన' మనసు కలిగి, ఆశలు, కోరికలు లేకుండ వుండడం అన్నది భావం. అప్పుడప్పుడు బాహ్య ప్రపంచం పూర్తిగా మరుగై, బహు నెమ్మది, ప్రశాంతతను అనుభవించే క్షణాలు కూడ మన జీవితాలలో చోటు చేసుకుంటాయి. అలాంటి అనుభవం జీవిత పర్యంతం వుండి పోవడానికి మార్గం ఏమిటి అన్నది ప్రశ్న.

ఈ ఆధ్యాత్మిక అన్వేషణలో ముఖ్యమైనది ఉన్నత శిఖరాలను అందుకోవాలన్న మౌలికమైన భావన కలిగి వుండడం. కొన్ని సంప్రదాయాలు మార్గమే లక్ష్యమని సూచిస్తాయి. అంటే, ఏదో మనం వెదకుతూ పోతే, ఆ చివర మనకు కావలసినది లభిస్తుందన్న అభిప్రాయం సరికాదంటారు. అది లభించడానికి మనం చేసే, చేయాల్సిన ప్రయత్నాలు అసంబద్ధమైనవి అనడానికి వీలు లేదు. దానికి విరుద్ధంగా, మనం చేసే ప్రయత్నమూ సరియైనది అర్థవంతమైనదే. ఆ దిశలో మన ప్రతి ఆలోచన, చర్య కూడ మన ఆధ్యాత్మిక పయనానికి ఉపకరించేవే అని గుర్తించాలి.

## సోపాన నిర్మాణం

ఈ నిచ్చెన నిర్మాణంలో మొదటి మెట్టు పునాదులు కదలకుండ వుండేలాగ చూసుకోవడం మంచి నడవడికి 'యమ' నియమ మూల సూత్రాలు దానికి ఆధారంగా చేయాలి. ఇక ఇతర మౌలిక సిద్ధాంతాలలో సక్రమమైన జీవనం, నిజాయితీ, అన్ని

విషయాలలో మితంగా ప్రవర్తించడం, ఇతరుల చర్యలపై తీర్మానాలు చేయకపోవడం, పరిస్థితులను పక్షపాతం లేకుండ అంచనా వేయడం, వీలైనంతవరకు దయాశీలురుగా వుండడం, చెప్పుకోదగినవి. అన్నిటికంటే ముందు 'అహింస' అంటే మాటలు చర్యల ద్వారా ఇతరులకు హాని కలిగించకుండ వుండడం. నిజానికి, ఈ ఆఖరు సూత్రాన్ని పాటిస్తే, మిగిలిన సుగుణాలన్నీ స్వాభావికంగానే అబ్బుతాయి.

ఒక మెట్టు మీద వున్నప్పుడు అవసరమైనవి ఆపై మెట్టుకు చేరినప్పుడు అవసరమౌతాయి. ప్రగతిలో ప్రతి దశలోను వేరే లక్షణాలు కావలసి వస్తాయి. మనం స్థిరంగా ఒక స్థాయిలోనే వుండము. క్రొత్తవాటి సహాయంతో ముందుకు వెళతాము. మనమే తఱచు అనిశ్చిత స్థితిలో వున్నప్పుడు ఇతరుల అభివృద్ధికి ఏమి అవసరమని ఆలోచించి తెలుసుకునే ప్రయత్నం అహంకారాన్ని సూచిస్తుంది. ఒకరికి పుస్తక పఠనం, దాని మననం, మరొక వ్యక్తికి నిశ్శబ్ద ధ్యానం, ఇంకొకరికి పూజ, మరొకరికి ఆచార కర్మలు - ఇలా మారుతూ వుండవచ్చు. మనకు ఏది ఫలితాన్నిస్తుందో గ్రహించి, ప్రగతిమార్గంలో ముందుకు నడవాలి.

అన్నిటినీ మించి, మాటలు, ఆలోచనలతో ఆగకుండ, నిచ్చెనను ఒక్కొక్క మెట్టు ఒకసారి ఎక్కుతూ పోవాలి.

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ నటేశ అయ్యర్

మల్లాది ఫణిమాల

శ్రీ నటేశ అయ్యర్ చిదంబరం నుంచి తిరువణ్ణామలై వచ్చి అక్కడ ఆశ్రమంలో వంటవానిగా చేరారు. లోకాన్ని సన్యసించాలనే బలమైన కోర్కెతో నటేశ అయ్యర్ తన భార్యనీ, కుమార్తెనూ విడిచి తిరువణ్ణామలై చేరారు. అక్కడ శ్రీ భగవాన్ పట్ల ఆకర్షితులయ్యారు. ఆశ్రమంలో వంటవానిగా చేరిన నటేశ అయ్యర్, రాత్రిపూట గిరిప్రదక్షిణ చేసి ఆశ్రమం చేరుకున్న వారికీ, ప్రయాణం చేసి రాత్రి సమయంలో శ్రీరమణాశ్రమం చేరుకునే వారికి అన్నం వండి వడ్డించేవారు, ఆశ్రమానికి వచ్చేవారికి తెల్లవారు జామున 3 గంటలకు లేచి వంట వండటం వారికి ఎంతో ఆనందదాయకం. భక్తులకు సేవ చేసి, వారి అవసరాలను గమనించుకుని, వారికన్నీ సమకూర్చడం నటేశ అయ్యరు గారికి ప్రత్యేక ఆనందాన్ని కలిగించేది.

నటేశ అయ్యర్ ఆశ్రమంలో వంటవానిగా చేరిన రోజులలో అక్కడ వంటనంతా బ్రాహ్మణ వితంతువులే చేసేవారు. వాళ్ళు ఆయనకి బాగా పని అప్పచెప్పటమే కాకుండా, ఆయనపైన అధికారం చెలాయించేవారు. నటేశ అయ్యర్ ఆ వేధింపులు తట్టుకోలేక పోయేవారు. ఎంతో కోపం కూడా వచ్చేది. కోపానికి గురి కావటం తప్పు అని తెలిసినప్పటికీ, వారు కోపాన్ని ఆపుకోలేక పోవటం నటేశ అయ్యరుకు మరింత బాధను కలిగించింది.

ఒకరోజు ఇలాగే కోపం వచ్చినప్పుడు, నటేశ అయ్యర్, శ్రీ భగవానుల వద్దకు వెళ్ళి, నిస్సహాయంగా నిలబడి, ఇలా అడిగే ఉద్దేశ్యం లేనప్పటికీ, ''కోపానికి లోనైనప్పుడల్లా గిరిప్రదక్షిణ చేయవచ్చునా'' అని ప్రశ్నించారు. నటేశ అయ్యర్ నిస్సహాయతను గమనించిన శ్రీ భగవానులు, చిరునవ్వు నవ్వి, గిరిప్రదక్షిణ తప్పకుండా చేయవచ్చును'' అన్నట్లుగా తలవూపుతూ, తమ అంగీకారాన్ని తెలియపరచారు. అప్పటినుండీ, కోపం వచ్చి నప్పుడల్లా, నటేశ అయ్యరుగారు, శ్రీ భగవానులకు ప్రణమిల్లి, అరుణగిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం అలవాటుగా ఏర్పరుచు కున్నారు.

ఇలా కొంతకాలం గడిచినప్పటికీ, ఆశ్రమ వంటశాలలో పరిస్థితి ఎంత మాత్రమూ చక్కబడలేదు. వంటశాలలో వితంతువుల వేధింపులను సహించలేక, ఇక ఆశ్రమం నుంచీ ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళిపోదామని, నటేశ అయ్యర్ నిశ్చయించుకున్నారు. ఇంటికి తిరిగి వెళ్ళిపోతూ, విల్లుపురం చేరారు. అక్కడ స్నానం చేసి, విభూతి పెట్టుకుని, శ్రీభగవానులను ప్రార్థిద్దామని కళ్ళు మూసుకున్నారు. ప్రార్థన చేసి కళ్ళు తెరువగానే, కళ్ళ ఎదుట భగవాన్ నిలుచుని ఉండుట గమనించిన నటేశ అయ్యర్ నిర్ఘాంత పోయారు. ''భగవాన్, మీరిక్కడికి ఎలా వచ్చార''ని ఆశ్చర్యపోతూ అడిగారు. శ్రీ భగవాన్ చిరునవ్వుతో, ''నటేశా, నువ్వు నా దగ్గరనుంచి ఎంత దూరం వెళ్ళిపోయావేమిటి?'' అని అడిగారు. కన్నీటితో కరిగిపోయిన నటేశ అయ్యర్ సమాధానమీయలేక పోయారు.

శ్రీ భగవాన్ మూర్తి తిరువణ్ణామలై వైపు నడుస్తుండగా, నటేశ అయ్యర్ వెంటే నడిచారు. అలా కొంతదూరం వెళ్ళాక, భగవాన్ మూర్తి అదృశ్యమైంది. కానీ నటేశ అయ్యర్‌కి మాత్రం తన ముందు ఆ మూర్తి వెళ్తున్నట్లే అనిపించింది. తెల్లవారే లోపు రమణాశ్రమం చేరుకున్నారు. హాలులోకి ప్రవేశిస్తూనే శ్రీ నటేశ అయ్యర్, శ్రీ భగవానులకు సాష్టాంగ నమస్కారం చేశారు. నటేశ అయ్యరును చూసి, శ్రీ భగవానులు విల్లుపురంలో అడిగిన ప్రశ్నయే మళ్ళీ అడిగారు. “నటేశా, నీవు నా దగ్గర్నుంచి ఎంత దూరం వెళ్లిపోయావేమిటి?” అని అడిగారు. నటేశ అయ్యరుకు కంటివెంట అశ్రుధార ఆగలేదు. దుఃఖంలో మునిగిపోయిన నటేశ అయ్యరు వెక్కి వెక్కి ఏడ్చారు. వంటింటిలోకి వెళ్ళి తన పనిని ప్రారంభించిన నటేశ అయ్యరుకు, ఈ సంఘటన తర్వాత శ్రీ భగవానుల పట్ల పరిపూర్ణ శరణాగతి ప్రారంభమైయ్యింది. అప్పటినుండీ వంటశాలలో వారు ఎదుర్కొనే ఇబ్బందులను గురించి ఫిర్యాదు చేయలేదు.

శ్రీ భగవాన్, అందరూ ఆశ్రమంలో తిరుగుతూ చూసే దేహం కారని నటేశ అయ్యర్‌కు అర్థమయ్యింది. శ్రీ భగవానుల గురించి నటేశ అయ్యర్ ఒకసారి అన్న మాటలివి: “మన మనస్సుతో అర్థం చేసుకుని అంచనా వేయగల వ్యక్తి గానీ, మరొకటి గానీ శ్రీ భగవాన్ కానే కారు. వారి గురించి మనకేమీ తెలియదని ఒప్పుకోవలసిందే. అంతే కాదు! వారి గురించి యదార్థం చెప్పలేమని కూడా ఒప్పుకోవాలి. శ్రీభగవాన్ గురించి నేనేమీ చెప్పలేను. ఎందువలనంటే, అసలైన భగవాన్‌ని మాటలతో వివరించలేము. రుచి చూస్తే కానీ తెలియని మాధుర్యం అది”.

నటేశ అయ్యర్ శ్రీ భగవానులతో ఎప్పుడూ మాట్లాడలేక పోయారు. ఎందుచేతననగా భగవాన్ సమక్షంలో వారి మనస్సుకు అంతులేని ప్రశాంతత చేకూరి, ఆ మౌనస్థితి యందు వారు పలుక లేకపోయేవారు.

శ్రీ భగవాన్‌కి ఆపరేషన్ జరిగినప్పుడు నటేశ అయ్యర్ వారికి పరిచారకునిగా ఉండేవారు. అప్పటి సంఘటనలను వర్ణించటం వారికి ఎంతో ప్రీతి. అప్పటి సన్నివేశాన్ని వివరిస్తూ నటేశ అయ్యర్ ఇలా చెప్పారు. ''ఆ సమయంలో శ్రీ భగవాన్ ప్రవర్తన, ఆ శరీరాన్ని వారు ధరిస్తున్నట్టుండేది. కండని కోశారు. నెత్తురు కారుతోంది. రేడియం సూదులను ఆ వ్రణం చూట్టూ గుచ్చటం చూశాను. శ్రీ భగవానులకు స్పృహ వుందిగానీ తమ చేతికి ఏం జరుగుతోందో దాని పట్ల నిర్లక్ష్యం కూడా ఉండేది. ఆపరేషన్ అయ్యిన తరువాత వైద్యులు శ్రీ భగవాన్‌కి సాష్టాంగ నమస్కారం చేశారు. వారిలో ఒకాయన, ''నేను ఎందరికో ఆపరేషన్లు చేశాను. కానీ ఎప్పుడూ, ఇటువంటి అనుభవం కలుగలేదు. నేనెక్కడా అనుభవించని ప్రశాంతత ఈ గదిలో ఉంది. మాటలకందని ఇటువంటి అనుభూతి నాకు ఇంకెక్కడా కలుగలేదు'' అని అన్నారు.

1970వ సంవత్సరంలో నటేశ అయ్యర్ గారిని వెల్లూర్‌లోని ఆసుపత్రికి కారులో తీసుకుని వెళుతున్నప్పుడు, మార్గమందు, ఒకానొక సమయమున, వారు తోటి భక్తులతో సైగలు కూడా చేయలేనంత అంతర్ముఖత్వంలోకి లాగబడి, ఆత్మనిష్ఠలో మునిగి పోయారు. వారిని ఆ విధంగా చూసిన భక్తులు, వారు కారులోనే మరణించారని అనుకున్నారు. కొంతసేపు అలా గడిచాక, నటేశ అయ్యర్, కళ్ళు తెరిచి, కారులో ఉన్న వారితో ఇలా ఎంతో స్పష్టంగా

పలికారు. "నా స్వస్వరూప స్థితి నాకు ఎఱుకలోకి వచ్చింది. 'నేను దేహాన్ని కాను' అనే సత్యాన్ని నేను తెలుసుకున్నాను. ఈ దేహానికి ఏమైపోయినా, నేను లెక్కచేయను. ఈ దేహంతో నాకు సంబంధం లేదు. కాబట్టి మీరు నన్ను ఆసుపత్రికి తీసుకుని వెళతారో లేక శ్రీరమణాశ్రమానికి తిరిగి తీసుకుని వెళతారో అది మీ ఇష్టానికే వదిలేస్తున్నాను".

నటేశ అయ్యర్ పలికిన ఈ మాటలు విన్న భక్తులు, వారిని వెల్లూరులోని ఆసుపత్రికి తీసుకెళ్ళి వారిని చేర్చారు. కొన్ని రోజులు గడిచాక, వారి శారీరక పరిస్థితి మెరుగుపడి, వారిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. వారిని తిరిగి శ్రీరమణాశ్రమానికి తీసుకుని వచ్చారు. శ్రీరమణాశ్రమం చేరిన కొంతకాలానికే వారు ఒకరోజు, "గురువారం నాడు సాయంత్రం 6 గంటలకు నేను వేదపారాయణ చేసే బాలురతో కలిసి వేదం చదవబోతున్నాను" అని అన్నారు. ఈ మాటలు విన్నవారందరూ ఎంతో ఆశ్చర్యపోయారు. ఎందుచేత నంటే నటేశ అయ్యర్ వేదాలు చదవటం ఎన్నడూ, ఎవ్వరూ చూసి యెఱుగరు. సరిగ్గా వారు ముందుగా సూచించిన సమయానికే అంటే గురువారము సాయంత్రం 6 గంటలకు నటేశ అయ్యర్ చనిపోయారు.

"వేదపారాయణ చేసే బాలురతో కలిసి వేదం చదువుతాను" అని సూచించటంలో అంతరార్థం అందరికీ ఇప్పుడు అర్థమైనది. సాయంత్రం 6 గంటలకు నేను శ్రీభగవానునిలో ఐక్యమైపోతాను అని సూచించటానికి, భగవాన్ సమాధి మీద కూర్చుని వేదం చదువుతాను అని అన్నారు శ్రీ నటేశ అయ్యర్.

నమ్మి కొలిచే భక్తులకు శ్రీభగవాన్ కొండంత అండగా నిలవటమే కాక, చిట్టచివరికి వారిలో ఐక్యం చేసుకుంటారు అన్న సత్యానికి, నటేశ అయ్యర్ గారి జీవితమే నిదర్శనము.

---

# శ్రీరమణ మహర్షి సూక్తులు

- కమలాకర వెంకటరావు

## ఆత్మజ్ఞానం

ఆత్మను తెలుసుకోడమంటే, ఆత్మగా ఉండిపోవడమే. ఏలనంటే అది తెలియబడే విషయం కాదు, తెలుసుకొనే విషయి - ఆత్మ నాకు తెలియడం లేదంటున్నావంటే నీకు అలవాటైన సాపేక్షిక జ్ఞానంతో - విషయ జ్ఞానంతో అంటున్నావు. 'నేను ఇది, అది' అని గాక, 'నేను నేను'గా ఉండి పోవడమే కావాలి.

## ఆత్మధ్యానం

'నేను బ్రహ్మమును' - అని ధ్యానం చెయ్యడం కంటే, మనస్సును అంతర్ముఖం చెయ్యడం ప్రధానం. 'నేను బ్రహ్మము'నని ధ్యానం చెయ్యవలసిన అవసరమేమున్నది? 'నేను'ను వినాశ మొదించడమే ముక్తి. కాని, అది 'నేను', 'నేను' - అనేదాన్ని ఎప్పుడూ ఏమరకుండా ఉన్నప్పుడే సాధ్యమౌతుంది. అందువల్లనే 'నేను' అనే భావాన్ని పరిశోధించవలసిన అవసరం ఏర్పడుతున్నది. 'నేను'ను వదలకుండా వుంటే సాధకుడు శూన్యస్థితిలో పడకుండా ఉంటాడు. లేనియెడల, ధ్యానం నిద్రలోనికి దారితీస్తుంది.

## ఆత్మ ప్రకాశం

చిత్తవృత్తులు లేకపోవడమంటే శూన్యస్థితి కాదు. శూన్యస్థితి నైనా తెలుసుకొనే వారొకరుండాలి. తెలియడం తెలియకపోవడం, రెండూ మనస్సువే. ఆత్మ యీ రెంటికీ అతీతం, - సాక్షాత్తూ ప్రకాశ స్వరూపం.

## ఆత్మప్రేమస్వరూపం

ఆత్మ ఆనంద స్వరూపం ప్రేమ స్వరూపం. ఆత్మ ప్రేమను బట్టే సమస్తమూ ప్రియమౌతున్నది. ప్రేమ ఆత్మకంటె వేరు కాదు. విషయ ప్రేమ తక్కువ తరగతి ప్రేమ. ఇక ఆత్మ అనేది కేవలం ప్రేమయే. మరొక రకంగా చెప్పితే భగవంతుడు ప్రేమ స్వరూపుడు అన్నా అదే.

## ఆత్మ లక్షణాలు

ఆత్మ యెప్పుడూ సత్-చిత్-ఆనంద లక్షణములు కలిగినదే. వీనిలో మొదటి రెండూ జాగ్రత్-స్వప్న-సుషుప్తులు మూడింటిలో కూడ తెలియబడుతూ వుండగా చివరిది సుషుప్తిలో మాత్రమే తెలియబడుతుందని చెపుతారు. జాగ్రత్-స్వప్నములలో ఆ ఆత్మలక్షణం లుప్తమవుతున్నదా అని ప్రశ్న. వాస్తవానికి అది లుప్తం కావడం లేదు. సుషుప్తిలో మనస్సుండదు. ఆత్మ తానుగా ప్రకాశిస్తుంది. జాగ్రత్ స్వప్నాలలో ప్రకాశించేది ఆత్మ యొక్క ఆభాస, సుషుప్తిలో మనోవృత్తి అణగిపోయిన పిమ్మట ఆనందం అనుభవానికి వస్తుంది. ఇతర సందర్భాల్లో అది ప్రియం, మోదం, ప్రమోదం అనే రూపాల్లో అభివ్యక్త మవుతుంది. కాని, అవన్నీ చిత్తవృత్తులే.

## ఆత్మలోనిది జగత్తు

జగత్తు మనః ప్రసారితమని నిత్యమూ జ్ఞాపకముంచుకో. మనస్సు

ఆత్మలోనిది. శరీరం యెక్కడెక్కడ సంచరించినా మనస్సును సంయమంలో ఉంచుకోడం అవసరం. శరీరం కదులుతుంది గాని ఆత్మ కదలదు. జగత్తంతా ఆత్మయందే ఉన్నది.

## ఆత్మ విచారావశ్యకత

ఆత్మవిచారం చెయ్యకపోతే లోకవిచారం నీకు గతి అవుతుంది. దేహమే ఆత్మ అనుకోడం వల్ల నిజమైన ఆత్మను నీవు కోల్పోయినట్లు కనిపిస్తున్నావు. ఇలా నీవు ఆత్మ అనుకుంటూ వున్నవి లోకంలో అనేకం ఉన్నాయి. కనుక నిజమైన ఆత్మను కనుక్కోడమే ఆత్మవిచారం, ఆత్మాన్వేషణ.

## ఆత్మవిచారం: సమర్పణం

పూర్ణజ్ఞానంతో చేసినదే సమర్పణం. ఆత్మవిచారం పూర్ణజ్ఞానానికి సాధన. అది సమర్పణలో పర్యవసిస్తుంది. జీవజ్ఞానాన్ని అతిక్రమించిన బ్రహ్మజ్ఞానములో సమర్పణకు తావెక్కడ అని అనవచ్చు. వస్తుతః జ్ఞానానికీ సమర్పణకూ భేదం లేదు. సాధకునకు ఇట్టి పరిస్థితిలో సత్సంగము, ఈశ్వర భక్తి ముఖ్యంగా ఉపాధేయాలు.

## ఆత్మవిద్య

అన్ని విద్యలలోకీ ఆత్మవిద్య అత్యంత సులభమైనది. ఎందుచేత? ఇతర విద్యలకు తెలుసుకునే వాడు. తెలుసుకోబడేది, తెలుసుకోడం అనే మూడింటి అవసరమున్నది. ఆత్మ విద్యకు అట్టిదేమీ అక్కరలేదు. తాను తానై వుండడమే కావలసినది. తనకంటే ప్రత్యక్ష విషయం తనకు ఏముంటుంది? కనుక, అది అత్యంత సులభం. 'నేను ఎవరిని?' అని విచారణ చేసుకోడం మాత్రమే ఇచ్చట అవసరం.

# The Importance of the Adi Guru

Dr.K.Subrahmanian (Talk 81)

Tomorrow is *guru purnima*, a very important day. It is also called Vyasa *purnima*, and it's the day on which every person expresses gratitude to the *guru* in his own way. Vyasa, also called Veda Vyasa, is our *adi guru*. In some of our languages, Vyasa means 'an essay'. In a good essay, there is a clear division; there is a beginning, a middle and an end. Vyasa literally means 'to divide'. Originally, there was only one *Veda*; Vyasa, however, felt that it would be very difficult for people to read a single large volume. He, therefore, divided it into four - *Rig Veda*, *Yajur Veda*, *Sama Veda* and *Atharva Veda*. Vyasa also wrote the *Mahabharatha* and the *Puranas*. We have a wealth of religious literature because of our *adi guru*.

Vyasa's father was Parashara, and Bhagavan's *gotra* was Parashara *gotra* - *Para Parashara gotra samudbhavam* is what Kavyakanta says. In a way, our *guru*, Bhagavan, is related to the *adi guru*, Vyasa. The long lineage of *guru parampara* includes Vyasa, his son Shuka (who gave us the *Bhagavatam*), Gaurapada, and Govinda Bhagavatpada. The next great *guru*, according to Kavyakanta, was Adi Shankara - *pashchad bhodhakalavidhuta timirah shanka paha Shankarah* - who came to this earth to remove our doubts (*shankas*) and difficulties, and give us happiness.

Shankara literally means 'one who does good'. Adi Shankara was born for the good of humanity, not just for the sake of India, but all humanity. He was *loka Shankara*.

*Shruti smriti puranam alayam karunalayam namami Bhagavad padam Shankaram. Shruti* - vedas, *alayam*- treasure house. Shankara was the treasure house of *shruti smriti purana*; he knew everything there was to know. He was not only a great intellectual with a sharp mind, but also the embodiment of *karuna* - *Karuna purna sudhabde.* The *karuna* of Shankara was truly extraordinary: *karunalayam namami Bhagavadpadam Shankaram loka Shankaram.*So, Kavyakanta says, "Of the stature of Vyasa, after a very long time, we had Shankara." Shiva himself came down to earth as Adi Shankara.

